నమస్తే తెలంగాణ

# ఇష్టారాజ్యంగా నాన్‌దోస్త్ కాలేజీలు!

- దోస్త్ పరిధిలో లేకుండా తప్పించుకుంటున్న వైనం
- రిజర్వేషన్లు, రీయింబర్స్‌మెంట్ నోచని విద్యార్థులు
- ముక్కుపిండి వసూలు చేస్తున్న వేలకు వేల ఫీజులు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని కొన్ని ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు తాము 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్నట్టు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. దోస్త్ పరిధిలో లేకుండా తప్పించుకుంటున్న ఈ కాలేజీలపై ఎవరి నియంత్రణ ఉండదు. రిజర్వేషన్లు అమలు కావు. విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నోచుకోలేరు. ఇక విద్యార్థుల నుంచి వేలకు వేల ఫీజులు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. వీటిలో చాలావరకు మైనార్టీ కాలేజీలే ఉండడం గమనార్హం. ఈ కాలేజీలను అదుపుచేస్తామంటున్న కళాశాల విద్యాశాఖ మాటలు నీటిమూటలుగానే మిగిలాయి.

## నాన్ దోస్త్‌లో 58 కాలేజీలు

రాష్ట్రంలో 8 వర్సిటీల పరిధిలో మొత్తం 957 డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిలో 899 డిగ్రీ కాలేజీలు దోస్త్ పరిధిలో ఉండగా మిగతా 58 కాలేజీలు నాన్‌దోస్త్ కింద ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లోని సీట్లను ఇంటర్ మార్కులను బట్టి దోస్త్ ర్యాంకులు కేటాయించి సీట్లు భర్తీ చేస్తున్నారు. గురుకుల డిగ్రీ కాలేజీల్లో అయితే ప్రవేశ పరీక్ష పెట్టి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నారు. ఇక నాన్‌దోస్త్ కాలేజీల్లో 2 ఎయిడెడ్ అటానమస్ కాలేజీలు, 10 ఎయిడెడ్, మరో 2 అన్ ఎయిడెడ్ అటానమస్ కాలేజీలు, 44 ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. వీటిలోని 36,637 సీట్లు దోస్త్ పరిధిలో లేవు.

## విద్యాశాఖ విఫలం

దోస్త్ నుంచి తమను మినహాయించాలని ఈ 58 కాలేజీలు గతంలో హైకోర్టును ఆశ్రయించాయి. 2017-18 నుంచి ఈ కేసు కోర్టులో నలుగుతుండడంతో ఏటా దోస్త్ నుంచి మినహాయింపు పొందుతున్నాయి. వీటిపై కొరడా ఝులిపించడంలో విద్యాశాఖ, కళాశాల విద్య కమిషనరేట్ విఫలమవతున్నాయి. దోస్త్‌ను అమలు చేయాలని ఏకంగా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. ఈ ఉత్తర్వులు పాటించకపోతే ఆయా కాలేజీల అఫిలియేషన్ రద్దుచేయవచ్చు. యూనివర్సిటీ గుర్తింపును ఉపసంహరించవచ్చు.

# 9 నుంచి ఇంటర్.. స్థానికంగా చదివితేనే లోకల్

ఈనాడు, హైదరాబాద్, విజయవాడ, వరంగల్

తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకూ స్థానికంగా చదివితేనే ఎంబీబీఎస్ లోకల్ కోటా సీట్లకు అర్హులని సంబంధిత నిపుణులు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ప్రోగ్రాం ద్వారా నడిచే ఎంబీబీఎస్ సీట్ల కౌన్సెలింగ్ ఆటోమేటిక్‌గా ర్యాంకులు, వెబ్ ఆప్షన్ల నమోదు ఆధారంగా జరిగిపోతుందనీ, ఏదైనా పొరపాటు జరిగితే.. వెంటనే పరిశీలించి సరిదిద్దుతుంటామనీ భరోసా ఇచ్చారు. వైద్యవిద్య ప్రవేశాలకు నిర్వహించే 'నీట్ కౌన్సెలింగ్'పై ఈనాడు- చదువు, శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీలు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఆన్‌లైన్ ఉచిత వెబినార్ విజయవంతమైంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రొ. నీలమేఘ శ్యామ్ దేశాయి సమన్వయకర్తగా వ్యవహరించగా డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం (విజయవాడ) రిజిస్ట్రార్ డా. వేమిరెడ్డి రాధికారెడ్డి, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (వరంగల్) ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా. నాగార్జునరెడ్డి, డెప్యూటీ రిజిస్ట్రార్ డా. కె. జ్యోతిలు కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించి విలువైన సూచనలు అందించారు. ముఖ్యాంశాలు ఇవీ...

## 'నీట్' వెబినార్‌లో నిపుణుల స్పష్టీకరణ



వెబినార్‌లో మాట్లాడుతున్న డా. రాధికారెడ్డి, డా.జ్యోతి, డా.నాగార్జునరెడ్డి. చిత్రంలో సమన్వయకర్త దేశాయి(పై వ్యక్తి)

## ఏపీ, తెలంగాణల్లో లోకల్ సీట్ల భర్తీకి ప్రాతిపదిక?

● ఏపీలో తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివితే వారినే లోకల్‌గా పరిగణిస్తాం. నాలుగేళ్లలో ఒక్క ఏడాది బయట వేరే రాష్ట్రాల్లో చదివినా నాన్‌లోకల్ అయిపోతారు. ఏపీలో ఎస్వీయూ, ఆంధ్రా విశ్వవిద్యాలయం రెండు పరిధులున్నాయి. అందుకే.. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఏ ప్రాంతంలో చదివితే.. ఆ విశ్వవిద్యాలయం పరిధిలో భర్తీ చేసే సీట్లకు వారిని లోకల్‌గా పరిగణిస్తాం.

● నీట్ పరీక్షకు అర్హత ఇంటర్మీడియట్ కాబట్టి.. వరుసగా తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్లు తెలంగాణలో చదివితేనే వారిని స్థానికులుగా పరిగణించి.. లోకల్ సీట్లను కేటాయిస్తాం. స్టడీ సర్టిఫికెట్ ఇక్కడే ఉండాలి. ఒకవేళ ఏదైనా దూరవిద్య ద్వారా చదివినా.. అలాంటి వారికి గత నాలుగేళ్లుగా తెలంగాణలో ఉన్నట్టుగా రెసిడెంట్ సర్టిఫికెట్ అడుగుతున్నాం

శ్రీ గోసలైట్స్
మెడికల్ అకాడమీ
...బ్రాండ్ ఆఫ్ ఫ్యూచర్ మెడికోస్

● ఏ ప్రాంతంలోని కళాశాలలో సీటు కావాలని కోరుకుంటే.. దాన్ని బట్టి ఆప్షన్లు పెట్టుకోవాలి. ఏపీలో కౌన్సెలింగ్ ఎన్ని దశల్లో జరిగినా ఒకేసారి 36 కళాశాలలకూ మొదటి కౌన్సెలింగ్‌కు ముందే ఆప్షన్లను పెట్టేసుకోవాలి. ఆ తర్వాత మార్చడానికి ఉండదు. అందుకే.. ఆరంభంలోనే జాగ్రత్తగా వారి ఆసక్తిని బట్టి.. కళాశాలలను ఎంపిక చేసుకునేలా వరుసగా నమోదు చేసుకోవాలి. తెలంగాణలో మొదటి దశ కౌన్సెలింగ్‌కు ఆప్షన్లు పెట్టుకున్నాక, తర్వాత రెండో దశకు మళ్లీ మార్చుకోవచ్చు, ఇలా ప్రతి దశకూ మార్చుకోవచ్చు.

● స్థానిక కోటా సీట్ల భర్తీ కోసం నమోదు చేసుకునే వెబ్ ఆప్షన్లతో ఆల్ ఇండియా కోటాకు సంబంధం ఉండదు. దానికి మళ్లీ ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

● మేనేజ్‌మెంట్, కన్వీనర్ కోటా సీట్లన్నీ నీట్ ర్యాంకుల ఆధారంగా మెరిట్ ద్వారానే భర్తీ చేస్తాం. యాజమాన్యాలకు భర్తీ చేసుకునే అవకాశం లేదు.

## మొత్తం సీట్లెన్ని?

● దేశంలో మొత్తం 1.10 లక్షల ఎంబీబీఎస్ సీట్లున్నాయి. వీటిలో ఈ ఏడాది 25,400 సీట్లను ఆలిండియా కోటా కింద మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ భర్తీ చేస్తుంది. ఏపీలో ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గత ఏడాది 6500 సీట్లను భర్తీ చేశాం. ఈ ఏడాది మరికొన్ని కళాశాలల్లో ప్రవేశాలకు అనుమతులు రావడంతో వాటిలో సీట్లు అదనంగా కలుస్తాయి. ఏపీలో ఉన్న ప్రభుత్వ సీట్లలో 15 శాతం అంటే.. 490 వరకూ ఆలిండియా కోటా కిందకి వెళతాయి. మిగతా వాటికి ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తాం. బీడీఎస్ సీట్లు ఏపీలోని ప్రభుత్వ కళాశాలల్లో 140 ఉన్నాయి. వాటిలో 15 శాతం ఆల్ ఇండియా కోటా కిందకు వెళతాయి. బీడీఎస్ సీట్లు ప్రైవేటు కళాశాలల్లోనే అధికంగా ఉన్నాయి.

● తెలంగాణ పరిధిలో ఉన్న 8415 సీట్లకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. ప్రభుత్వ సీట్లలో 15 శాతం అంటే 637 సీట్లు ఆలిండియా కోటా కింద భర్తీ అవుతాయి. మిగతా 85 శాతం సీట్లను ఇక్కడే కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తాం. తెలంగాణలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లోని 50 శాతం సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే కన్వీనర్ కోటా ద్వారా భర్తీ చేస్తాం. మిగతా 50 శాతం మేనేజ్‌మెంట్ కోటా సీట్లను కూడా కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ద్వారానే భర్తీ చేస్తాం. బీడీఎస్ సీట్లు తెలంగాణలోని ఒక ప్రభుత్వ కళాశాలలో 100 ఉన్నాయి. వీటిలో 15 శాతం ఆలిండియా కోటా కిందకు వెళతాయి.

**తప్పులు దొర్లితే ఏంచేయాలి?... రిజిస్ట్రేషన్లు ఎప్పుడు మొదలవుతాయి?... రిజర్వేషన్ల సంగతి?... కౌన్సెలింగ్ కోసం ఏ సర్టిఫికెట్లు అవసరం?**

తదితర వివరాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

ఆంధ్రజ్యోతి

హైదరాబాద్ • సోమవారం 21 జూలై 2025

# బీటెక్ సెకండియర్‌లో బ్రాంచ్ మార్పు!

## అవకాశం కల్పించే యోచనలో ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 'ఇంజనీరింగ్‌లో మొదట చేరిన బ్రాంచ్ చదవడం కష్టంగా ఉంది.. కొనసాగాలన్న ఆసక్తి లేదు.. వేరే బ్రాంచ్‌కి మారే అవకాశమివ్వండి'... ఒకటి, రెండు సెమిస్టర్లు పూర్తయి అత్యధిక పేపర్లు ఫెయిలయ్యాక విద్యార్థులు తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయానికి వచ్చి చేస్తున్న విజ్ఞప్తి ఇది. గత ఏడాదికాలంలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఇలాంటి దరఖాస్తులు చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలో ఒకసారి చేరాక ఇంటర్నల్ స్లైడింగ్, స్పాట్ కౌన్సెలింగ్ ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యాక ఇతర కోర్సుల్లో చేరడం సాధ్యం కాదు. ప్రారంభంలో ఆసక్తిగా చేరిన విద్యార్థులు తర్వాత కొనసాగేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇష్టంలేని కోర్సు చదవలేక, అందులో ఉత్తీర్ణత సాధించలేక చదువుకు దూరమవుతున్నారు. ఇలా అనాసక్తితో బీటెక్ మధ్యలోనే మానేసిన వారు, నాలుగేళ్లు ఎలాగోలా నెట్టుకొచ్చినా తర్వాత బీటెక్ పట్టా పొందనివారి సంఖ్య ఏటా పెరుగుతోంది. గత రెండేళ్లలో దాదాపు 9 వేల మంది విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసినట్టు అధికారిక గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి ఆసక్తికి అనుగుణంగా ద్వితీయ సంవత్సరంలోనూ బ్రాంచ్ మారే అవకాశం ఇవ్వాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి భావిస్తోంది. ఈ దిశగా నిపుణుల సూచనలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వం అనుమతిస్తే ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేసే అవకాశాలున్నాయి.

### ఇంటర్నల్ స్లైడింగ్‌తో కోర్ కోర్సులకు నష్టం..

ఇంజనీరింగ్ విద్య విద్యార్థుల ఆసక్తులకనుగుణంగా ఉండాలన్న లక్ష్యంతో కొత్త సంస్కరణలు అమలుచేయాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి భావిస్తోంది. ఇంజనీరింగ్‌లో ప్రవేశాలు పొందిన వారిలో అనేక మంది మధ్యలోనే చదువు ఆపేస్తుండగా.. మరికొందరు నాలుగేళ్ల తర్వాత కూడా తప్పిన సబ్జెక్టులు ఉత్తీర్ణులు కాలేక ఇంజనీరింగ్‌కు దూరమవుతున్నారు. దీనికి పరిష్కారంగా ద్వితీయ సంవత్సరంలోనూ బ్రాంచ్ మారే అవకాశమివ్వాలని ఉన్నత విద్యామండలి భావిస్తోంది. మొదటి సంవత్సరం ప్రవేశాల్లో రెండో విడత కౌన్సెలింగ్ పూర్తయ్యాక ఇంటర్నర్ స్లైడింగ్‌లో ఒకే కాలేజీ పరిధిలో వేరే బ్రాంచ్‌కి మారే అవకాశం ఉంటుంది. ఈ విధానంలో అనేక మంది ఆసక్తితో కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో ప్రవేశం పొందిన తర్వాత.. ఇంటర్నల్ స్లైడింగ్‌లో అవకాశం ఉంటే సీఎస్ఈకి వెళ్లిపోతున్నారు. గత ఏడాది ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో దాదాపు 5,500 మంది ఇంటర్నల్ స్లైడింగ్ అవకాశాన్ని వినియోగించుకున్నారు. వీరంతా కోర్ కోర్సులైన ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ వదిలి సీఎస్ఈ, అనుబంధ బ్రాంచ్‌లను ఎంచుకున్నారు. రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయ్యాక మెకానికల్ ఇంజనీరింగ్‌లోని మొత్తం 4,456 సీట్లలో 3,983 (89.38%) సీట్లు భర్తీకాగా.. ఇంటర్నల్ స్లైడింగ్ తర్వాత ఇందులోని అనేక మంది సీఎస్ఈకి వెళ్లడంతో చివరగా మెకానికల్‌లో రాష్ట్రవ్యాప్తంగా 2,086 (46.81%) సీట్లు మిగిలిపోయాయి. అలాగే ట్రిపుల్‌ఈలో మొత్తం 6,303 సీట్లుండగా.. 2,326, ఈసీఈలో మొత్తం 15,634లో 1,401 సీట్లు మిగిలిపోయాయి. మిగిలిన సీట్లన్నీ భర్తీ చేయాలన్న లక్ష్యంగా ఇంటర్నల్ స్లైడింగ్ చేస్తున్నా.. కోర్ బ్రాంచ్‌లకు తీరని నష్టం జరుగుతోంది. రెండో సంవత్సరంలో విద్యార్థులకూ ఇంకో అవకాశం ఇస్తే కోర్ బ్రాంచ్‌ల్లోనూ సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంటుందని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది.

### అన్ని బ్రాంచ్‌లకు సమ ప్రాధాన్యత లక్ష్యం



ఇంజనీరింగ్ అంటే కేవలం సీఎస్ఈ మాత్రమే కాదు. బీటెక్‌లో వివిధ బ్రాంచ్‌ల్లో మొత్తం 47 కోర్సులున్నాయి. సీఎస్ఈ చదివితేనే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని అనేక మంది భావిస్తున్నా.. అది వాస్తవం కాదు. రాష్ట్రంలో అనేక రంగాలకు చెందిన భారీ పరిశ్రమలు వస్తున్నాయి. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, ఆటోమొబైల్.. ఇలా అనేక రంగాల్లో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలకు సీఎస్ఈ అవసరమైనట్టుగానే.. ఐటీయేతర కంపెనీల్లో మానవ వనరులకు కోర్ ఇంజనీరింగ్ పట్టభద్రులు అవసరం. అందుకే ద్వితీయ సంవత్సరంలోనూ ఇంటర్నల్ స్లైడింగ్ అవకాశం ఇచ్చి కోర్ ఇంజనీరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని భావిస్తున్నాం.

- ఆచార్య బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

వార్త, హైదరాబాద్, సోమవారం 21, జూలై 2025

# 50 ప్రైవేటు డిగ్రీ కాలేజీల మూసివేత?



## 63 కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కాని వైనం

## 957 డిగ్రీ కాలేజీల్లో 1,41,590 అడ్మిషన్లు

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 50 కాలేజీలకి పైగా మూతపడనున్నాయి. ఆయా కాలేజీల్లో ఈ ఏడాది డిగ్రీ మొదటి సంవత్సరంలో ఒక్క అడ్మిషన్ కూడా కాలేదు. ఈ ఏడాది కాదు.. గత ఏడాది కూడా ఈ కాలేజీల్లో ఒక్క సీటు కూడా భర్తీ కానన్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రతి ఏడాది డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) పేరుతో అడ్మిషన్ల ప్రక్రియను చేపడుతున్నారు. గత తొమ్మిదేళ్లుగా డిగ్రీ అడ్మిషన్లను దోస్త్ ద్వారానే చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేటు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఏ కాలేజీలో ఎన్ని సీట్లు భర్తీ అయ్యాయనే విషయాన్ని దోస్త్ >>2

# 50 ప్రైవేటు డిగ్రీ కాలేజీల మూసివేత?

>> అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది కూడా 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దోస్త్-2025 ద్వారా అడ్మిషన్లను చేపట్టారు. మొత్తం మూడు విడతల్లో సీట్ల కేటాయింపును చేపట్టడమే కాకుండా చివరిగా ఇంట్రా కాలేజీల స్లైడింగ్‌కి అవకాశం కల్పించారు. మూడు విడతల్లో సీట్ల కేటాయింపు చేపట్టిన తరువాత విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టింగ్ చేశారు. విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టింగ్ చేసిన తరువాత అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలించిన అధికారులు.. రాష్ట్రంలోని 64 డిగ్రీ కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా కాలేదని ప్రకటించారు. వాటిలో 63 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉండగా.. ఒక్కటి మాత్రం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఉంది. మొత్తం 64 డిగ్రీ కాలేజీల్లో 20,260 సీట్లు ఉన్నాయి. 63 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఈ ఏడాది ఒక్క అడ్మిషన్ కూడా జరగలేదు. వీటిలో సుమారు 50కి పైగా డిగ్రీ కాలేజీల్లో గత ఏడాది కూడా అడ్మిషన్లు జరగలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఈ 50కిపైగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలను మూసివేసేందుకు కాలేజీ యాజమాన్యాలు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. గత ఏడాది అడ్మిషన్లు జరగకపోవడం.. ఈ ఏడాది అడ్మిషన్లు రాకపోవడంతో 2022-23లో చేరిన విద్యార్థులు ఈ ఏడాదితో డిగ్రీ పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి కాలేజీలను మూసివేయాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. 2014 నుంచి రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల మూసివేత కొనసాగుతూనే ఉంది. 2014లో సుమారు 1100 వరకు ఉన్న కాలేజీలు మూతపడుతూ వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 900కి పడిపోయాయి. గత ఏడాది, ఈ ఏడాది అడ్మిషన్లు రాని కాలేజీలు మూతపడనున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న 676 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు కొనసాగుతుండగా వాటిలో సుమారు 3లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. 3 లక్షల సీట్లలో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యే సరికి సుమారు 80వేల అడ్మిషన్లు పూర్తయినట్టు అధికారులుప్రకటించిన లెక్కలనుబట్టి తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీలు 957 ఉన్నాయని వాటిలో 4,36,947 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 1,41,590 సీట్లు భర్తీ అయినట్టు దోస్త్ అధికారులు ప్రకటించారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్, సోమవారం 21 జూలై 2025

# బీటెక్ వైపు బడుగుల అడుగు

## ఇంజినీరింగ్‌లో బీసీ విద్యార్థుల హవా • మొత్తం సీట్లలో 53% సీట్లు కైవసం • కోటాకు మించి 24% అధికంగా సీట్లు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : ఒకప్పుడు ఇంజినీర్ కావడమంటే, బీటెక్ సీటు సాధించడమంటే వ్యాపార కుటుంబాలు, సంపన్నవర్గాలకే పరిమితం. కానీ ఈ తరంలో బడుగుల బిడ్డలు బీటెక్ చదువును అందిపుచ్చుకుంటున్నారు. ఈ ఏడాది బీటెక్ కోర్సుల్లో తొలిసారి 53% సీట్లు బీసీలే సొంతం చేసుకున్నారు. ఎప్‌సెట్ మొదటి విడతలో మొత్తం 77,561 సీట్లు భర్తీ కాగా, 41,087 సీట్లను బీసీలే దక్కించుకున్నారు. ఓసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన వారు కేవలం 36,474 సీట్లను మాత్రమే దక్కించుకున్నారు. ఈ మూడు వర్గాలతో పోల్చితే ఒక్క బీసీ సామాజికవర్గ విద్యార్థులే 4,613 సీట్లకు ఎక్కువగా సొంతం చేసుకోవడం విశేషం. ఎప్‌సెట్‌లో ఈ సారి ఓసీలు 19.9%, ఎస్సీలు 16.9%, ఎస్టీలు 10.2% సీట్లను దక్కించుకున్నారు. అదే బీసీలు 53% సీట్లను సొంతం చేసుకున్నారు. బీటెక్ సహా అన్ని రకాల ప్రొఫెషనల్ కోర్సుల్లో బీసీల కోటా 29శాతమే. అయితే ఈ సారి ఏకంగా 53% సీట్లను అంటే.. కోటా కంటే 24% సీట్లను బీసీ విద్యార్థులు దక్కించుకోవడం గమనార్హం. ఈ 24% సీట్లను ఓపెన్ కోటాలో బీసీ విద్యార్థులు దక్కించుకోవడం గమనార్హం. బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు తమ కోటాతోపాటు ఓపెన్ కోటాలోనూ సీట్లను దక్కించుకున్నారు. ఎస్సీలకు 15% సీట్లకు 16.9% సీట్లు, ఎస్టీలు 10శాతానికి 10.2% సీట్లను దక్కించుకున్నారు. ఈ సారి 15% ఏపీ కోటా సీట్లకు కోత పడింది. ఈ సీట్లను మన రాష్ట్ర విద్యార్థులకే కేటాయించారు. తాజా లెక్కలను పరిశీలిస్తే ఏపీ కోటా సీట్లు, ఓపెన్ కోటా సీట్లను దాదాపుగా బీసీ విద్యార్థులే దక్కించుకోవడం విశేషం.



**సామాజిక వర్గాల వారీగా బీటెక్ సీట్లు దక్కించుకున్న వారి వివరాలు**

| సామాజికవర్గం | సీట్లు | శాతం |
|---|---|---|
| ఓసీ | 15,470 | 19.9 |
| బీసీ | 41,087 | 53.0 |
| ఎస్సీ | 13,083 | 16.9 |
| ఎస్టీ | 7,921 | 10.2 |

**బీసీ ఉప కులాలవారీగా సీట్లు దక్కించుకున్నవారు**

| ఉప కులం | అబ్బాయిలు | అమ్మాయిలు | మొత్తం |
|---|---|---|---|
| బీసీ -ఏ | 3,096 | 2,768 | 5,864 |
| బీసీ -బీ | 8,301 | 7,596 | 15,897 |
| బీసీ -సీ | 226 | 140 | 366 |
| బీసీ -డీ | 7,002 | 6,476 | 13,478 |
| బీసీ -ఈ | 3,811 | 1,671 | 5,482 |